క్లుప్తంగా

4న దుకాణాల లీజు వేలం

బంగారుపాళెం: మండలంలో మొగిలి శివాలయానికి సంబంధించిన వివిధ దుకాణాలకు ఈ నెల 4న లీజు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మునిరాజు, వంశ పారంపర్య ధర్మకర్త విజయకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు దేవదాయశాఖ అధికారుల సమక్షంలో వాహనాల పార్కింగ్, కొబ్బరి కాయలు, పూజాసామగ్రి విక్రయం, పాదరక్షలు భద్రపరచుట, కొబ్బరి చిప్పల సేకరించుకునే హక్కు, తలనీలాల సేకరణ హక్కుకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. తలనీలాల సేకరణకు సంబంధించి రూ.50 వేలు, మిగిలిన వాటికి సంబంధించి రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలియజేశారు. ఇతర వివరాలకు ఆలయ కార్యాలయంలో సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

49.2 మిల్లీమీటర్ల వర్షపాతం



వర్షంలో గ్యాస్ సిలిండర్ల కోసం అవస్థలు పడుతున్న జనం

బంగారుపాళెం: మండలంలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు 49.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ తెలిపారు. తుపాను ప్రభావంతో మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపిలేని వర్షం కురుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తుపాను కారణంగా ఎక్కడా సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ



గెలుపొందిన బృందావన్ పాఠశాల విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని సంతపేట వద్ద ఉన్న బృందావన్ సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థులు అబాకస్ పోటీల్లో ప్రతిభ చాటినట్లు చైర్ పర్సన్ శైలజాకుమారి ఆదివారం విలేకరులకు తెలిపారు. ఆదివారం తమిళనాడు రాష్ట్రం వేలూరులో శ్రీ నారాయణి స్కూల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారని, 7వ తరగతి విద్యార్థి సుదీక్ష ఛాంపియన్‌షిప్ సాధించినట్లు చెప్పారు. అలాగే 8 మంది విద్యార్థులు గెలుపొంది బహుమతులు సాధించారన్నారు. అనంతరం ఆ విద్యార్థులను కళాశాల డైరెక్టర్ ప్రియతేజ అభినందించారు.

ఎన్టీఆర్ జలాశయం గేట్ల ఎత్తివేత



నిండు కుండలా ఎన్టీఆర్ జలాశయం

పెనుమూరు(కార్వేటినగరం): తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని కలవకుంట ఎన్టీఆర్ జలాశయం శనివారం రాత్రి పూర్తిస్థాయిలో నిండడంతో ఆదివారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు జలాశయం దిగువ మండలాలైన పెనుమూరు, గంగాధరనెల్లూరు సరిహద్దులో ప్రవహించే నీవా నది పరివాహక ప్రాంత గ్రామాల్లో దండోరా వేసి ప్రజలను అప్రమత్తం చేశారు. అనంతరం ఇరిగేషన్ డీఈ జయచంద్ర, ఏఈ భరత్‌కుమార్‌రెడ్డి జలాశయం రెండు గేట్లు ఎత్తి 200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

- రెవెన్యూ శాఖలో ఇదీ వీఆర్వోల దందా
- వసూళ్ల పర్వంలో కొందరు వీఆర్వోలే కీలకం
- రూ.4 వేల నుంచి రూ.5 వేలు డిమాండ్
- లేకుంటే తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

గుడిపాల మండలంలో మ్యుటేషన్ పేరిట వీఆర్వోల దోపిడీ పర్వం కొనసాగుతోంది. చేయి తడపనిదే ఫైళ్లను తాకడం లేదు. రూ.4 వేల నుంచి రూ. 5 వేల వరకు ఇస్తే తప్ప మ్యుటేషన్‌కు మోక్షం కలగడం లేదు. లేదంటే రైతులకు అగచాట్లు తప్పడం లేదు. కొందరు వీఆర్వోలు ఈ దందాలో కీలకపాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వీఆర్వో: ఏమి యా ఇలా వచ్చావు?
రైతు: నమస్కారం స్వామి..మా నాయనా చనిపోయినాడు.. పట్టా చేస్కోవాలి.
వీఆర్వో: పాసుబుక్కు ఇదా.. మీ నాయనికి ఎంత మంది కొడుకులు, కూతుర్లు..? పోయి ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్టు, డెత్ సర్టిఫికెట్టు, ఆధార్, రేషన్ కార్డులు పట్టుకు రా.
రైతు: స్వామి అన్నీ ఉండాయి. మా నాయనకు నేనొక్కడే కొడుకు..
వీఆర్వో: అట్లనా.. ఇప్పుడు టైం లేదు.. రేపు రా..!
రైతు: దీని కోసం సంవత్సరంగా తిరగతా ఉండా.. ఇప్పుడు కూడా అట్లా అంటే ఎట్లా స్వామి..?
వీఆర్వో: సరేలే యా.. ఎంతుండాది నేల?
రైతు: .1.45 ఎకరా ఉండాది స్వామి..
వీఆర్వో: యోవ్... ఇట్లా రా.. వాళ్లంతా ఉండారు.. అందుకే ఇట్లా పిలిచా.. ఎకరా పైన అంటున్నావ్.. రూ. 8 వేలు ఇచ్చేయ్.. వాళ్లకు.. వీళ్లకు కూడా ఇవ్వాలి. దబ్బులిస్తే.. నీ పని చిటికెలో చేసి పెడతారు. నెలలో పాసుబుక్ నీ చేతిలో ఉంటాది.
రైతు: బీదోణ్ని స్వామి.. ఇలా అంటే ఎలా? పని అయితే ఎంత కొంత ఇస్తా సూడండి స్వామీ.
వీఆర్వో: సరే లేయా.. దబ్బులు ఎంత ఇస్తావో ఇచ్చేయ్.. ఫైలు తీసుకోరా!
ఇదీ మండల కేంద్రంలో మ్యుటేషన్ కోసం వెళ్లిన ఓ రైతు, వీఆర్వో నడుమ సాగిన సంభాషణ.

చేయి తడిపితేనే మ్యుటేషన్..

లేదంటే టెన్షన్



తహసీల్దార్ కార్యాలయం

గుడిపాల: మండలంలో మొత్తం 32రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో 16 మంది వీఆర్వోలు పనిచేస్తున్నారు. వీరి వద్దకు నిత్యం పదుల సంఖ్యలో రైతులు, ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తూంటారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం రోజూ ప్రజలతో కిటకిటలాడుతోంది. చాలా మంది భూ సమస్యలతో పాటు మ్యుటేషన్ కోసం వచ్చేవారే కనిపిస్తున్నారు. నెలకు 40 నుంచి 60 వరకు మ్యుటేషన్ దరఖాస్తులు వస్తున్నాయి. ఇదే అవకాశంగా కొందరు వీఆర్వోలు ముడుపులకు మరిగారు.

ఆరునెలల నుంచి 80 ఫైళ్లు పెండింగ్

మండలంలో మ్యుటేషన్ ఫైళ్లు దాదాపు 80 వరకు పెండింగ్‌లో ఆరు నెలల నుంచి పెండింగ్ ఉన్నట్టు తెలియవచ్చింది. దీనికి ప్రధాన కారణం చేయి తడపనిదే ఆ ఫైళ్లను తాకని కొందరు వీఆర్వోల తీరు మూలాన రెవెన్యూ యంత్రాంగమే అప్రతిష్ట పాలవుతోంది. డబ్బులు ఇవ్వనిదే వీఆర్వోలు మ్యుటేషన్ పనులు చేయడం లేదని వాపోతున్నారు. కొందరైతే త్వరితగతిన కావాలని రూ. 10 వేలు ఇచ్చిన ఉదంతాలు కూడా ఉన్నట్టు తెలిసింది. డబ్బులు ఇవ్వనిపక్షంలో ఆ ఫైల్‌ను ఆన్‌లైన్‌లో ఎక్కించడం లేదు. దీంతో చాలా మంది కొందరు లంచావతారులైన వీఆర్వోలను ఏం చేయలేక నిస్సహాయంగా కుమిలిపోతున్నారు.

విధులంటే అంతులేని నిర్లక్ష్యం

కొందరు వీర్వోలు కార్యాలయానికి ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్నారు. వచ్చిన ఆ కొందరు కూడా మధ్యాహ్నానికే దుమ్మా కొడుతున్నారు. కొందరు మండల కేంద్రానికి వెళితే..మరికొంత మంది మాత్రం వారి ప్రైవేటు భవనంలో రిలాక్సవుతున్నారు. అక్కడ ఎవరైతే డబ్బులిస్తారో వారి పనులు చేసేందుకు మాత్రం ఉత్సాహం చూపుతుంటారనే విమర్శలొస్తున్నాయి. వీఆర్వోలు ఇంత నిస్సిగ్గుగా అన్నదాతలను దోచుకుంటున్నా అధికార యంత్రాంగం ఏ చర్యలూ తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇకనైనా మ్యుటేషన్ కష్టాల నుంచి తమకు విముక్తి కల్పించాలని పలువురు రైతన్నలు కోరుతున్నారు.

నా దృష్టికి రాలేదు



మ్యుటేషన్‌కు సంబంధించి వీఆర్‌ఓలు డబ్బులు డిమాండ్ చేస్తున్నారనేది ఇంతవరకు నా దృష్టికి రాలేదు. రైతులు ఎవరైనా ఇచ్చిన పక్షంలో ఆధారాలతో తీసుకువస్తే పై స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారిపై చర్యలు ఖచ్చితంగా తీసుకుంటాం. దీనిపై వీఆర్‌ఓలకు సమావేశం నిర్వహించి దారిలో పెడతా. రైతుల సమస్యలు ఉన్నట్లయితే నేరుగా నా సెల్ నంబర్ 9491077019 కే నిరభ్యంతరంగా ఫోన్ చేసి చెప్పండి.

– చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్, గుడిపాల

ఎడతెరపిలేని జడివాన

- జనజీవనం అస్తవ్యస్తం



జడివానకు పూతరాలిన కంది చెట్లు

తవణంపల్లె: ఫెంగల్ తుపాను ప్రభావంతో రెండు రోజులు పాటు ఎడతెరపిలేని జడివాన కురిసింది. మండలంలో ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు 59.19 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జడివానతో మూగజీవాలకు గ్రాసం లేక నానాఅవస్థలు పడ్డారు. వర్షాలకు ఎలాంటి వాహనాలు, ప్యాసింజర్ ఆటోలు సైతం నడవలేదు. అరగొండ బహుదానదిలో నీటి ప్రవాహం కొంత పెరిగింది. మండలంలో వాగులు, వంకలు పారాయి. వర్షాలకు మట్టితో ఇటుకల కోసే పనులు ఆగిపోయాయి. కంది చెట్లలో ఏపుగా ఉన్న పూత రాలిపోయి తీవ్రంగా నష్టం కలిగించింది. వ్యవసాయ పనులు సైతం స్తంభించి పోయాయి.

ఘనంగా క్రైస్తవుల జెండా ఆవిష్కరణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగర, మండలంలో ఆదివారం క్రైస్తవులు జెండా ఆవిష్కరణను ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ ఈవ్ కార్యక్రమాల్లో భాగంగా డిసెంబర్ 1న ప్రతి ఏటా క్రైస్తవులు జెండా ఆవిష్కరించడం ఆనవాయితీ. నగర, మండలంలోని పలు చర్చిల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. పాస్టర్లు వాక్య సందేశమిచ్చారు. అనంతరం చర్చిలు, శిలువ కొండలో జెండా ఎగురవేశారు.

అందరికీ ఇబ్బందే..!





వర్షం పడుతున్నా ఆటోలో కూరగాయలు విక్రయిస్తున్న ఓ మహిళ, బస్సు కోసం ప్రయాణికుల నిరీక్షణ

చిత్తూరు అర్బన్: బంగాళాఖాతంలోని అల్పపీడనం కారణంగా ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో వర్షం పడుతూనే ఉంది. చిరు వ్యాపారాలు వర్షం వల్ల ఇబ్బందులు తప్పలేదు. వ్యాపారాలు అంతంత మాత్రంగానే జరిగాయి. నగరంలోని పలు రోడ్లు వర్షం నీటితో ఇబ్బందులు తప్పలేదు. కాలువలు పొంగి రోడ్లపైనే ప్రవహించింది. మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, రెస్క్యూ బృందాలతో కాలువలు పొంగి పొర్లే చోట నీటి ప్రవాహాన్ని నియంత్రించారు.



చిత్తూరు కట్టమంచి వద్ద వర్షపు నీటి వద్ద పనులు చేయిస్తున్న డాక్టర్ లోకేష్



కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

వరి.. రైతులు వర్రీ..!

ఐరాల: ఫెంగల్ తుపాను ప్రభావానికి కురుస్తున్న వర్షాలకు వరి పంట నేలకొరిగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు వర్షార్పణం అయితే నష్టం చవిచూడక తప్పదని వాపోతున్నారు. మరోవైపు ముసురుగా ఉండటం వలన వరి కోతలు వాయిదా వేస్తున్నారు. జనజీవనం స్తంభించింది. ఈదురుగాలులు, చలి పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



ఐరాలలో కురుస్తున్న ముసురు వర్షం

ప్రజా చైతన్యంతోనే హెచ్‌ఐవీ నిర్మూలన



చిత్తూరు కలెక్టరేట్: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బంగారుపాళెం: ప్రజా చైతన్యంతోనే హెచ్‌ఐవీ నిర్మూలన సాధ్యమని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌చార్జి మెడికలాఫీసర్ డాక్టర్ విజయకుమారి అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినం సందర్భంగా వైద్య, ఐసీటీసీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌కు మందులు లేవని, నివారణే మార్గమన్నారు. ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీ పరీక్షలు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని ఐసీటీసీ సెంటర్‌లో ఉచితంగా హెచ్‌ఐవీ పరీక్షలు చేసి రిపోర్టు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు1988 డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రతి ఏటా ఇదే రోజున ఎయిడ్స్ నివారణ దినం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.198లో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ బోర్డు ఏర్పాటు చేశారని, దీని కృషితో అప్పటి నుంచి ఎయిడ్స్ రోగుల శాతం తగ్గుతూ వస్తోందన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ బాబు, స్టాఫ్‌నర్సులు రిజ్వానా, సునీత, ఎక్స్‌రే టెక్నీషియన్ నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: హెచ్‌ఐవీ రహిత సమాజ ఆవిర్భావానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషిచేయాలని సీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర అన్నారు. ప్రపంచ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ దినం పురస్కరించుకుని ఆదివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందు జాగ్రత్తగా హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. దీని నివారణకు ఇప్పటివరకు వ్యాక్సిన్ లేదన్నారు. సురక్షితం కాని లైంగిక సంబంధాలు, హెచ్‌ఐవీ కలుషిత రక్తమార్పిడి, హెచ్‌ఐవీ కలుషితమైన సూదుల వాడకం వల్ల హెచ్‌ఐవీ ఒకరి నుంచి మరొకరికి వస్తుందని, అవగాహనతో వీటికి దూరంగా ఉండటమే ఉత్తమమన్నారు.





బంగారుపాళెం: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, గుడిపాల: సీఎన్ఆర్ కళాశాలలో..

సావిత్రమ్మ మహిళా డిగ్రీ కాలేజీలో..

చిత్తూరు కలెక్టరేట్: ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారిణి షమ్స్ అక్తర్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం పురస్కరించుకుని ఆ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం గిరింపేట వరకు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ, ఎయిడ్స్ వ్యాధి సోకిన వారిని చులకనగా చూడరాదన్నారు. దేశంలో ఉన్న ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల్లో మన రాష్ట్రం రెండవ స్థానంలో ఉందన్నారు. అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చన్నారు. అనంతరం రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ కోమలాదేవి మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఉషారాణి, తిరుకుమరన్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలతో ప్రమాదం

నగరి: మున్సిపల్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు ప్రమాదకరంగా మారుతున్నాయి. తుపాను హెచ్చరికలను ప్రభుత్వం జారీ చేసే సమయాల్లో అధికారులు లోతట్టు ప్రాంతాలు, నివాసాల్లోకి నీరు వచ్చే ప్రాంతాలు, కాలువ గట్లు బలంగా లేని చెరువులను పరిశీలించి, గుర్తించాల్సి ఉంటుంది. అయితే తుపాను గాలికి ఫ్లెక్సీలు నిలుస్తాయా, అవి కూలిపడితే ప్రజలకు కలిగే నష్టం, విద్యుత్ తీగలపై పడితే జరిగే ప్రమాదాలు తదితర అంశాలను మాత్రం పరిశీలించడం లేదు. దీంతో తుపాను తాకిడికి రోడ్డు పక్కనే ఉన్న ఫ్లెక్సీలు రోడ్డుపై వెళ్లేవారి గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. అదృష్టవశాత్తు కొన్ని ఫ్లెక్సీలు రోడ్డుపై పడే సమయంలో ఆయా ప్రాంతాల్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదాలు తప్పుతున్నాయి. అన్ని సమయాలు ఒకేలా ఉండవు. శనివారం రాత్రి ఓంశక్తి ఆలయం సమీపంలో ఓ ఫ్లెక్సీ బైక్‌పై వెళుతున్న ఒక జంటపై పడడంతో అభి అనే మహిళ తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అలా ప్రమాదాలు జరిగినపుడే అధికారులు మేలుకుంటున్నారు. పెట్టేవన్నీ రాజకీయ ఫ్లెక్సీలు కావడంతో అధికారులు కూడా పట్టించుకోవడం లేదు.



టవర్‌క్లాక్ సెంటర్‌లో పడిన ఫ్లెక్సీ

కుప్పం సీఓఈకి అవార్డు



సీఓఈకి అందజేసిన సిల్వర్ సర్టిఫికెట్

కుప్పంరూరల్: కుప్పం మండలం, పెద్దబంగారునత్తం వద్ద ఉన్న సీఓఈ (సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్)కు ఢిల్లీలోని ప్రముఖ స్వచ్ఛంద సంస్థ స్కాచ్ రెండవ బహుమతి (సిల్వర్ సర్టిఫికెట్) అందజేసింది. దేశం మొత్తం వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న రంగాలకు స్కాచ్ సంస్థ ఏటా అవార్డులను అందజేస్తుంది. ఈ ఏడాది కుప్పం సీఓఈకి ఈ అవార్డు అందజేసినట్లు ఉద్యానశాఖ ఏడీ కోటేశ్వరరావు తెలిపారు. 50లక్షలకు పైగా అంటు కట్టు మొక్కలు రైతులకు అందజేసి రైతులకు సహాయపడినందుకు ఈ అవార్డు వచ్చినట్లు కోటేశ్వరరావు తెలిపారు.

వరి పంట ధ్వంసం

- తొక్కి నాశనం చేసిన గున్న ఏనుగులు



ఏనుగులు ధ్వంసం చేసిన వరి పంట

పలమనేరు: మండలంలోని మొసలిమడుగు గ్రామానికి చెందిన బాలాజినాయుడుకు చెందిన వరి పంటను శనివారం రాత్రి రెండు గున్న ఏనుగులు తొక్కి నాశనం చేశాయి. వర్షం కారణంగా ఇప్పటికే నేలవాలిన వరిని ఏనుగులు నాశనం చేశాయంటూ బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతోపాటు అడవిపందులు కూడా పంటను నాశనం చేశాయని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఈరోజు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తవణంపల్లె: మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రెడ్డిబాబు, తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిశీలించి పరిష్కరిస్తామని తెలియజేశారు.

కార్పొరేషన్ కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

చెర్లోపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

తవణంపల్లె: మండలంలోని చెర్లోపల్లెలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి చెర్లోపల్లె హెల్త్‌నెస్ సెంటర్ వద్ద ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు డాక్టర్ మోహన్‌వేలు, డాక్టర్ కేశవ నారాయణ, డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామీణ దారులు అధ్వానం

మండలంలోని గ్రామీణ ప్రాంతాల రోడ్ల పరిస్థితి వర్షాలకు చాలా దారుణంగా ఉంది. అసలే మట్టిదారులు.. ఎటుచూసినా గుంతలు..చిన్నపాటి కుంటలను తలపిస్తున్న వర్షపు నీటి నిల్వ ఉన్న గుంతలు..బురద బురద.. ద్విచక్రవాహనదారులైతే ఈ బురద ధాటికి నియంత్రణ కోల్పోయి జారిపడటం..అద మరిస్తే ఆస్పత్రి పాలయ్యేలా దుస్థితికి చేరాయి. వీటిని కాస్తా బాగు చేయండి మహాప్రభో అని కోరుతున్నా పాలకులు వాటికేసి దృష్టి సారించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

- వర్షాలకు ఛిద్రం
- రాకపోకలకు తప్పని అవస్థలు
- ఎన్నికల హామీలను నెరవేర్చేదెన్నడో..?



గ్రామానికి వెళ్లే దారిలో ప్రవహిస్తున్న వంక



బురదమయంగా ఉన్న మొరవ వడ్డిపల్లె మట్టి రోడ్డు

ఐరాల: మండలంలోని నాగంవాండ్లపల్లె పంచాయతీకి చెందిన మొరవ వడ్డిపల్లె మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. వర్షం పడితే మట్టి రోడ్డు బురద..బురదగా మారి అధ్వానంగా మారుతోంది. అడుగు తీసి అడుగు వెయ్యలేని పరిస్థితి నెలకొంది. కేవలం మట్టి రోడ్డుపైనే ప్రయాణించాల్సి ఉంది. వర్షం వస్తే ఈ గ్రామం నుంచి బయటకు వచ్చేందుకు అవకాశం లేకుండా పోతోంది. మరో వైపు డ్రైనేజీలు లేక మురుగు నీరు వర్షంలో కలిసి మట్టి రోడ్డుపై ప్రవహిస్తోంది. దీనిమూలాన జ్వరాల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. గ్రామం ముందు వాగు ప్రవాహం ఉంది. వెనుక బీరప్పచెరువు మరవ సైతం రాకపోకలకు అవరోధంగా కలిగిస్తున్నాయి. రోడ్డు మొత్తం బురదమయంగా మారిపోవడంతో రాకపోకలు నానా ఫీట్లు చేయాల్సి వస్తోంది.. బురద రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. గ్రామానికి ఉన్న ఒక్క రోడ్డు ఇటు వాగు, అటు మరవతో ద్విచక్ర వాహనాలు ప్రయాణించే పరిస్థితి లేదు. ఆటోలు సాధారణ సమయంలో తిరుగుతాయి. వర్షం వస్తే ఆటోడ్రైవర్లు ఇటుకేసి అస్సలు రారు. రైతన్నలు కూడా పొలాలకు వెళ్లేందుకు, ఇతరత్రా పనులకు వచ్చే అవకాశం లేకుండా పోతోంది. మట్టి దారిని సీసీ రోడ్డుగా మారుస్తామని, మురుగు కాలువలు నిర్మిస్తాని ఎన్నికల సమయంలో నాయకులు హామీలు ఇచ్చినా ఇప్పటివరకూ ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇకనైనా రోడ్ల రూపురేఖలు ప్రయాణానికి అనువుగా మార్చాలని, కనీసం మరమ్మతులైనా చేయాలని ప్రజలు కోరుతున్నారు.